నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న అల్లూరి జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్.టి.విశ్వేశ్వర నాయుడు సోమవారం తెలిపారు. 64 పిహెచ్‌సిల పరిధిలో 3214 అంగన్ వాడి కేంద్రాలు, 3124 ప్రభుత్వ పాఠశాలలు, 82 ప్రైవేటు పాఠశాలలు, 46 జూనియర్ కాలేజీలు, 16 ఐటిఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్ కాలేజీలలో మొత్తం 3,16,754 మంది చిన్నారులు, విద్యార్థులు ఉన్నారన్నారు. ఆయా పిహెచ్‌సిలలో 3,85,469 అల్బెండజోల్ మాత్రలను అందుబాటులో ఉంచామన్నారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని 16,720 మంది వంట సిబ్బంది కూడా ఈ దఫా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 336 మంది పర్యవేక్షణ సిబ్బందితో వైద్యాధికారుల పర్యవేక్షణలో 4321 టీమ్‌లను ఏర్పాటుచేసి జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలబాలికలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు.

విష జ్వరంతో చిన్నారి మృతి

- చిన్నకోనెల, బూరిగలో విజృంభిస్తున్న జ్వరాలు
- పలువురికి తీవ్ర అస్వస్థత : వైద్యానికి ఎదురుచూపు
- విజయనగరం జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని చిన్న కోనెల, బూరిగ గ్రామాల్లో విషజ్వరాలు విజృంభించాయి. జ్వరాలతో గిరిజనులు అల్లాడిపోతుండగా, నాలుగు నెలల చిన్నారి జ్వరమరణంతో మన్యవాసులు భయాందోళలనకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లో అనేకమంది జ్వరాలతో అస్వస్థతకు గురై మంచం పట్టగా, కొందరు విజయనగరం జిల్లాఓని ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యసేవలు అందించి, జ్వరాల అదుపునకు చర్యలుచేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు వేడుకుంటున్నారు.

చిన్నకోనెల, బూరిగ గ్రామాల్లో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. సార కొత్తయ్య కుటుంబంలోని నాలుగు నెలలు పాప ఆదివారం సాయంత్రం 4గంటలకు విజయనగరం గోశాల ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ ఆరోగ్యం విషమించి మృత్యువాత పడింది. జ్వరంతో బాధపడుతున్న ఈ చిన్నారిని ఈనెల 7న గజపతినగరం ఏరియా ఆసుపత్రికి ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లారు. మూడురోజుల పాటు వైద్యం పొందినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యుల సూచనల మేరకు ఈనెల 10న ఆదివారం విజయనగరం గోశాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యం పొందుతూ ఆరోగ్యం విషమించి మరణించింది.

చిన్నకోనెల గ్రామానికి చెందిన కోనపర్తి కృపారాణి, సోముల .చిన్నమ్మ, బూరుగ గ్రామానికి చెందిన మూడేళ్ల సోముల జెర్సీ జ్వరంతో బాధపడుతూ ప్రస్తుతం గజపతినగరం ఏరియా హాస్పిటల్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. సోమ్మెల. ఆదయ్య, అతని కుమారుడు మూడేళ్ల గణేష్, తొమ్మిదేళ్ల సోముల చిన్నారావు జ్వరంతో అల్లాడుతూ, ఎస్ కోట ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. చిన్న కోనేల గ్రామంలో ఏడేళ్ల కోటపర్తి సన్యాసిరావు, ఆరేళ్ల కోటపర్తి రవి, ఏడేళ్ల కోటపర్తి సుప్రియ ఇలా పలువురు చిన్నారులు జ్వరాలతో బాధపడుతూ, ఇంటి వద్దే వారం రోజులుగా అల్లాడిపోతున్నారు. గుమ్మకోట ఆసుపత్రి ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు మూడు రోజుల క్రితం ఆయాగ్రామాలకు వచ్చి రోగులకు వైద్య సేవలు అందించారు. కానీ జ్వరాలు తగ్గుముఖం పట్టలేదని వాపోతున్నారు.

జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఇప్పటికైనా జిల్లా వైద్యఆరోగ్యశాఖ యంత్రాంగం స్పందించి, జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో ప్రత్యేక వైద్యబృందాలు, అత్యవసర మందులతో వైద్యశిబిరాలను నిర్వహించి జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

మన్యంలో కుండపోత వర్షం

- జనజీవనం అస్తవ్యస్తం
- వారపుసంతలకు ఇబ్బందులు
- గిరి రైతుల హర్షం

అరకు లోయలో కురుస్తున్న జోరు వాన

ప్రజాశక్తి- అరకులోయ: పర్యట కేంద్రమైన అరకులోయలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం దట్టమైన ఒక మంచు కురిసింది. తర్వాత వేసవిని తలపించేలా ఎండలు మండిపోగా, మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కుండపోత వర్షం కురవడంతో అరకులోయ టౌన్షిప్‌లోని రోడ్డులు కాలువను తలపించే విధంగా వర్షపు నీటి పారింది. వాహన చోదకులు. పాద చారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సుమారు రెండు గంటలపాటు ఇటీవల కురిసిన వర్షాల్లో ఇదే భారీ వర్షమని, జనజీవనం అస్తవ్యస్తమైందని స్థానికులు అంటున్నారు. పలు చోట్ల రోడ్డులో వర్షపు నీరు నిలిచి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డుంబ్రిగుడ: మండలంలో సోమవారం మధ్యాహ్నం కుండపోతతో భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల పాటు వర్షం కురవడంతో వీధిలన్నీ వర్షపు నీటితో నిండాయి. వర్షం సాగుకు మేలు చేస్తుందని గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు పడ్డారు.

పెదబయలు : ఏజెన్సీలోని పెదబయలు మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలో వారపు సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సోమవారం ఉదయం ఎండ కాయడంతో వ్యాపారాలు, గిరిజనులు సంతకు తరలివచ్చారు. అయితే మధ్యాహం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో సంత చిందర వందరగా మారింది. సంతకు వచ్చిన ఆంధ్ర, ఒడిశా వినియోగదారులు, మైదానప్రాంతం నుంచి వచ్చిన వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వారపుసంత బురదతో నిండి పోయింది. వారపు సంతోలో రింగు రోడ్డు అదనపు మార్కెట్ షెడ్డు నిర్మించి గిరిజన వ్యాపారస్తులకు ఉపాధి కల్పించే విదంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులు జలమయం

చింతపల్లి : మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటసేపు కురిసిన భారీ వర్షంతో రహదారులు, వీధులు జలమయమయ్యాయి. ప్రధాన రహదారి సహా పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో ఆహార పదార్థాలు, పళ్ళు, కూరగాయలు విక్రయించే చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వారి తెచ్చిన సరుకులు తడిసిపోవడంతో ఆర్థిక నష్టం వాటిల్లింది.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ,దండకారణ్య జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, కళాశాల ప్రిన్సిపాల్ పటాస్ చలపతిరావు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ 1994లో ఐక్యరాజ్యసమితి గుర్తించిన తర్వాత ఏటాప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ప్రతి గిరిజనుడు వాడవాడలా పండగలా జరుపుకుంటున్నారన్నారు. . ఆదివాసులకు ఉన్న ప్రత్యేకమైన భాష సంస్కృతి,సంప్రదాయాలు భావితరాలకు అందించవలసిన బాధ్యత ఈ తరానికి ఉందన్నారు గిరిజన ప్రాంతంలో ఆదివాసు లందరికీ విద్యా,వైద్యం మౌలిక సదుపాయాలు ప్రభుత్వాలు కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి, విద్యార్థినుల నైపుణ్యాలు వెలికితీతపై ఇటువంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. కళాశాలకు సహాయ సహకారాన్ని అందించిన ఎస్ఎఫ్ఐ, ఆదివాసి గిరిజన సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.వ్యాసరచన పోటీల్లో.మొదటి బహుమతి జి అనుష్క, రెండో బహుమతి కె కావ్య,మూడో బహుమతి వి పార్వతి సొంతంచేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాంగి రామన్న, సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, కళాశాల అధ్యాపకులు బి శుభన్, ధర్మరాయ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సురేంద్ర, బాలదేవ్,ప్రిన్సిపల్ చలపతిరావు

రాయితీ విడుదలలో జాప్యంపై ఆగ్రహం

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి
- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వాహనాలు, పరిశ్రమలు, సేవారంగాలను నెలకొల్పిన 160 మందికి రాయితీలు అందించాల్సి ఉండగా, ఒక్కరికైనా రాయితీ విడుదలకు చర్యలు చేపట్టకపోవడంపై పరిశ్రమల శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి రాయితీలు అందించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోనూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులుగా నియమించి తగిన శిక్షణ అందించాలని సూచించారు పరిశ్రమలు, క్రషర్లు నుండి వస్తున్న కాలుష్యాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, నివారణ చర్యలు చేపట్టలాన్నారు. క్రషర్లను అధికారులు తనిఖీ చేయాలని సూచించారు.

సమావేశంలో పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్ల పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, సహాయ సంచాలకులు ఆర్‌వి. రమణారావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి వి.మురళి, కాలుష్య నియంత్ర మండలి ఇఇ సరిత పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీ రాణి

ప్రజాశక్తి- రంపచోడవరం

డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీ రాణి పిలుపునిచ్చారు. అంగన్‌వాడి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకూ జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల్లో శ్రామికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో 42 రోజులు పాటు అంగన్‌వాడీలు చేసిన సమ్మెలో భాగంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో పని చేయనటువంటి సెల్‌ఫోన్లతో పనిచేయలేక ఎంతో మానసిక ఒత్తిడికి గురై ఎంతోమంది అంగన్వాడీలు గుండెపోటుతో మృతి చెందారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీలకు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిలబెట్టుకోవడం లేదని విమర్శిం చారు. గ్రామీణ ప్రాంతంలో పదివేల లోపు ఆదాయం వచ్చే వారికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని చెప్తూనే రూ.7 వేల వేతనాలు వస్తున్న మినీవర్కర్స్, హెల్పర్స్‌కి మాత్రం సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా చేసినందుకు ప్రభుత్వ ఉద్యోగాలకు ఇచ్చినటువంటి బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్వాడి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు ప్రతి శ్రామికుడు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా రంపచోడవరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల దారుణమైన వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఆదాని అంబానీలకు కారుచౌకగా అమ్మేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, అంగన్వాడి జిల్లా ప్రధాన కార్యదర్శి, శాంతిరాజు జిల్లా నాయకులు

మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం సీలేరు ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకుకు సోమవాం దుప్పిలివాడ పంచాయతీ గొందిపాలెం గ్రామానికి చెందిన బురిడీ జయ(48) పెట్రోల్ వేయించుకకునేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. అయితే ప్రమాద వశాత్తూ బైక్ బోల్తా కొట్టి అతనికి గాయాలయ్యాయి. బంక్ సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి సమాచారం అందించారు. పీటర్ అంబులెన్స్ టెక్నీషియన్ వెంకటేష్ వాహనంతో చేరుకుని ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి, స్టాఫ్‌నర్స్ హైమ వైద్యసేవలందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

జికెవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ కడుగుల గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జికె వీధి మండలం దామనపల్లి పంచాయతీ సిగ్నపల్లి రాంనగర్ కాలనీ గ్రామానికి చెందిన కాకారి దారబాబు(26) అనే యువకునికి తీవ్రగాయాలయ్యాయి. అటుగా వస్తున్న ప్రయాణికులు గమనించి చింతపల్లి ఆసుపత్రికి తరలించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర శుభమ్‌నొఖ్వాల్

సబ్ కలెక్టర్‌గా శుభమ్ నొఖ్వాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని శుభమ్ నొఖ్వాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో ఆహ్వానించారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో సివిల్ సర్వీసెస్ ద్వారా ఐఎఎస్ అధికారిగా ఎంపిక అయ్యానని ఎన్టీఆర్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా పనిచేశానని అనంతరం ఇక్కడికి వచ్చినట్టు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలోని రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పథకాలు అదేవిధంగా తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు సకాలంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం నిత్యవసర సరుకులు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు సరిత, శివ, త్రిమూర్తులు, తదితరులు సబ్ కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.

అర్జీలు తీసుకుంటున్న పిఒ, సబ్ కలెక్టర్

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన అర్జీలు వ్యక్తిగతానికి సంబంధించిన అర్జీలను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపుతామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం మాట్లాడుతూ ఈ వారం 47 అర్జీలు రావడం జరిగిందని ఆయన తెలిపారు.

సబ్‌కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

రంపచోడవరం రెవిన్యూ డివిజనుకు సబ్‌కలెక్టరుగా వచ్చిన శుభం నొఖ్వాల్‌ను రాష్ట్ర రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఎపిఆర్ఎస్ఎ), రంపచోడవరం రెవిన్యూ డివిజను సభ్యులు తహశీల్దారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

-ప్రజాశక్తి, రంపచోడవరం

భూస్వాములకు ఊడిగం చేసే కుట్రలు దేనికి?

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-వి.ఆర్‌పురం: బిజెపికి చెందిన పాయం వెంకయ్య, ఊయికా రత్తయ్య ఆదివాసీల పక్షమా లేక స్థానికంగా లేని భూస్వాముల పక్షమా తేల్చుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ప్రశ్నించారు. ఆదివాసీలకు, స్థానిక నిర్వాసిత గిరిజనేతర ప్రజలకు గొడవలు పెట్టే విధంగా భూస్వాములకు ఊడిగం చేసే విధంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘంపై చేస్తున్న తప్పుడు ప్రకటనలు మానుకోవాలని హెచ్చరించారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన భూములకు స్థానికంగా లేని భూస్వాములు 15 సంవత్సరాల క్రితమే నష్టపరిహారం తీసుకు న్నారని ఒకపక్క నష్టపరిహారం తీసుకుని మరోపక్క 15 సంవత్సరాల నుండి ఆ భూములను అధికకౌలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కౌలు డబ్బులు ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఇస్తున్నారు తప్పితే స్థానిక ఆదివాసీలకు మాత్రం ఇవ్వడం లేదన్నారు. నిరుపేద ఆదివాసీలు స్థానికంగా లేని నష్టపరిహారం తీసుకున్న భూస్వాముల భూముల్లో జెండాలు పాతితే మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆదివాసీలకు స్థానిక నిర్వా సిత గిరిజనేతరులకు గొడవలు పెట్టాలని చూస్తే ఆదివాసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీలో ఎవరి పక్షాన నిలబడతారో తేల్చుకుంటే మంచిదని వాస్తవాలు తెలుసుకోకుండా ఆదివాసీ గిరిజన సంఘంపై తప్పుడు ప్రచారాలు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సున్నం రాజులు, కారం సుందరయ్య, పులి బొజ్జి, పాయం సీతారామయ్య, మడకం నాగమణి, సోయం చినబాబు, కుంజ ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై భూషణం

ప్రజాశక్తి-రంపచోడవరం: జూనియర్ కళాశాల సెంటర్లో సోమవారం పోలీసు, ఆర్టీవో అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే వారితో పాటు వాహనంలో ఉన్న వారు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనచోదకులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా వెంటఉంచుకోవాలని సూచించారు. రంపచోడవరం ఎస్సై భూషణం, ఏఎస్ఐ మల్లేశ్వరరావు, ఆర్‌టిఒ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చినబాబు

రాజవొమ్మంగి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని జడ్డంగి ఎస్ఐ చినబాబు హెచ్చరించారు. సోమవారం జడ్డంగి సెంటర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. గెడ్డంగి నర్సీపట్నం ప్రధాన జాతీయ రహదారిపై ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులు తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో రోడ్డు భద్రత, మోటారు వాహన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వాహనాల సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని డ్రైవర్ పక్కన ఎవర్నీ కూర్చోబెట్టుకోకూడదని తెలిపారు. సూచించారు.

ప్రజాకేంద్రిత పాలన బలోపేతమే లక్ష్యం

ఆది కర్మయోగి శిక్షణ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- అరకులోయ : గిరిజన ప్రాంతాల్లో గ్రామస్థాయి నాయకత్వాన్ని పెంపొందించడం, ప్రజా కేంద్రిత పాలనను బలోపేతం చేయడమే ఆది కర్మయోగి కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రారంభించిన ఆది కర్మయోగి జాతీయస్థాయి కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం అరకులోయలోని గుడ్ మార్నింగ్ రిసార్ట్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించే ఆది కర్మ యోగి శిక్షణను జిల్లా కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఆది కర్మయోగి ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ, వికసిత భారత్ నిర్మాణంలో గిరిజన సమాజాన్ని భాగస్వామ్యం చేయడం, గిరిజన ప్రాంతాల్లో స్థానిక నాయకులను తయారు చేసి, ప్రభుత్వ పథకాలు, ప్రతి కుటుంబానికి చేరేలా చూడటం, ఆత్మీయత, వ్యవస్థ బద్ధత పాలన అందించడం దీని ఉద్దేశ్యమన్నారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆది కర్మయోగి ఉపయోగాలను వివరించారు.

దేశవ్యాప్తంగా 20 లక్షల మంది గిరిజన గ్రామస్థాయి కార్యకర్తలు చేంజ్ లీడర్స్, ఫంక్షనరీలను తయారు చేసి, అభివృద్ధి పనులు గ్రామం వరకు చేరేలా చూడటం ముఖ్య ఉద్దేశమన్నారు. పాలనలో భాగస్వామ్యం, గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రభుత్వ శాఖల సమన్వయం గిరిజన వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు అభివృద్ధి, జలశక్తి, విద్య, అటవీ శాఖలతో కలసి పని చేయడం లక్ష్యమన్నారు. ప్రాంతీయ ప్రాసెస్ ల్యాబ్‌లు (రీజినల్ ప్రాసెస్ లాబ్స్) రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, రాష్ట్ర ప్రాసెస్ ల్యాబ్‌లు (స్టేట్ ప్రాసెస్ లాబ్స్), జిల్లా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, తరువాత గ్రామస్థాయి కార్యకర్తలకు శిక్షణ ఉంటుందన్నారు. పిఎం జనమన్, డజగు వంటి పథకాలతో అనుసంధానంగా ఆది కర్మయోగి కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు టీములుగా పాల్గొన్నారు.

ప్రత్యేక పంటలతోనే గిరిజనాభివృద్ధి

రైతులకు మెమొంటోను అందిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

అరకులోయ: మన్యంలో పండించే ప్రత్యేక పంటలతోనే గిరిజన రైతుల అభివృద్ధి సాధ్యమని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక అక్షయ ఇన్ హోటల్‌లో జయంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధిక దిగుబడి సాధించిన మిరియాల రైతులకు ప్రత్యేక అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాఫీ, మిరియాలు, అల్లం, పసుపు, జీడిమామిడి, ఇతర సుగంధ ద్రవ్య పంటల సాగును వైపు గిరిజన రైతులు విస్తరించాలని సూచించారు. అధిక లాభాలను అందించే పంటల సాగుపై శిక్షణా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ, స్వచ్ఛంద సంస్థలు, జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
ముఖ్యంగా కాఫీ, మిరియాల పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయా లేదా, అన్న విషయాన్ని అధికారులు గమనించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ హితవు పలికారు. గతంలో విదేశీ కొనుగోలుదారులు చెల్లింపులు చేసినప్పటికీ, రైతులకు డబ్బు సకాలంలో అందక మధ్యవర్తుల చేతుల్లో ఉత్పత్తులు ఇరుక్కున్న చేదు అనుభవాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా అధిక ఉత్పత్తి సాధించి లాభాలు పొందిన రైతులకు కలెక్టర్ ప్రత్యేక మెమెంటోలు అందజేశారు. జయంతి సంస్థ అధికారులు దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కల్యాణి, చింతపల్లి ప్రాంతీయ ఉద్యానశాఖ అధికారి, శెట్టి హిమబిందు, జయంతి సంస్థ ప్రతినిధులు, జిల్లాలోని 11 మండలాలకు చెందిన 400 మందికి పైగా మిరియాల రైతులు పాల్గొన్నారు.

చింతపల్లి రహదారిపై ఉన్న పశువులు

పశుసంచారంపై చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి : బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై పశువులు సంచారంపై తగిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి సర్పంచ్ దురియ పుష్పలత హెచ్చరించారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి ప్రధాన రహదారిపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పశువులు రోడ్ల మధ్యలో తిరగడంతో పాదాచారులు, చిన్నపిల్లలు, వాహనచోధకులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెట్రోల్ బంకుల దగ్గర, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అసౌకర్యంగా ఉన్న మలుపుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయని తెలిపారు. పశువుల యజమానులకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇకపై రోడ్లపై పశువులు కనబడితే గురువారం నుండి ప్రత్యేక వాహనాల ద్వారా వాటిని దూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు. పశువుల యజమానులు. పశులను జాగ్రత్త. పరుచుకోవాలని లేనిపక్షంలో, పంచాయతీ ఎటువంటి బాధ్యత వహించదని స్పష్టం చేశారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీత

మొక్కల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మొక్కలు పెంపకంతో గిరి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత అన్నారు. సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గసబ పంచాయతీ లోగిలి గ్రామ గిరిజన రైతులకు పండ్ల మొక్కలు, సిల్వర్‌వోక్ మొక్కలను సోమవారం పంపిణీ చేశారు. 40మంది రైతులకు 40ఎకరాలకు సరిపడా మొక్కలు అందజేసినట్లు సర్పంచ్ సునీత తెలిపారు.. పండ్ల మొక్కలు, కాఫీ, మిరియాల పంటల ద్వారా అధిక లాభం పొందవచ్చని,నీడ నిచ్చే మొక్కలు పెంచి కాఫీ సాగును అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొర్రా మహదేవ్, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డ్ మెంబర్ పి సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతిమ, వసంతి, కాఫీ లైజన్ వర్కర్ పాంగి. శివ, హర్టికల్చర్ బలరాం పాల్గొన్నారు.

కాశీపట్నంలో ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని కాశీపట్నం గ్రామ సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ఎంపిపి శెట్టి .నీలవేణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాశీపట్నంలో పర్మినెంట్ ఆధార్ సెంటర్‌ను మంజూరు చేశారని, వీటి సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్ ఇతర సేవలను ఈ కేంద్రంలో పొందవచ్చని సూచించారు.కాశీపట్నం ఆధార్ కేంద్రం అందుబాటులోకి రావడంతోఈ ప్రాంత ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపిపి నీలవేణి అన్నారు.కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సన్యాసిరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, గుమ్మకోట సర్పంచ్ అప్పారావు స్థానిక నాయకులు పుష్పానందం పాల్గొన్నారు.

యుటిఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న గంగరాజు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- అరకులోయ : యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని అరకులోయలో యూనియన్ ప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అరకు వేలి గిరిజన భవన్‌లో యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు ఉల్లి గంగరాజు ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ నాయకులు ఎరుకులు, మర్రి రమణ , తాంగుల చిట్టిబాబు, రఘునాథ్ యుటిఎఫ్ సిద్ధాంతాలు, లక్ష్యాలు వివరించారు. కార్యక్రమంలో మండల శాఖ నాయకులు డి.రాజబాబు, ఎల్‌బి. చంద్రశేఖర్, రామచందర్, ఎస్.సోమి, . నారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

హౌసింగ్ పీడీ బాబూనాయక్

లబ్ధిదారునితో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పిఎం జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ఆదిమ జాతి పివిటిజి గిరిజనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబు నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని కొత్తూరు పంచాయతీ బెడ్డగూడ గ్రామాన్ని సందర్శించి, పిఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలించారు.లబ్ధిదారులతో మాట్లాడారు.
ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ బాబు నాయక్ మాట్లాడుతూ ఆదివాసులకు పక్క గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఇళ్లను మంజూరు చేసిందని, వాటిని సకాలంలో పూర్తిచేయాల్సిన బాధ్యత లబ్ధిదారులపైనే ఉందన్నారు. నిర్మాణాల ప్రాప్తికి ఎప్పటికప్పుడు శాఖాపరంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా బిల్లులు చెల్లిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక హౌసింగ్ ఎఇఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ
మండల కేంద్రంలో డ్రైనేజీ, సిసి రోడ్లు, తాగునీరు, కమ్యూనిటీ భవన్‌లో బోరు శ్మశానవాటికకు సిసి రోడ్డు, నీటి సౌకర్యం ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించాలని టిడిపి మండల మాజీ అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఎం సింహాద్రి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఆదివాసీ దినోత్సవానికి హాజరు కాని అధికారులకు నోటీసులు

ప్రజాశక్తి- రంపచోడవరం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి హాజరు కాని అధికారులకు, సిబ్బందికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన స్థానిక యూత్ ట్రెనింగ్ సెంటర్లో జరిగిన ఆదివాసీ దినోత్సవానికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది హాజరవ్వాల్సిందిగా తెలియజేశామని అయినా హాజరుకాని అధికారులకు నోటీసులు ఇస్తామని ఆయన తెలిపారు.

అన్నవరం వాగుపై తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు పలువురు అధికారులు అన్నవరం బ్రిడ్జిని సోమవారం పరిశీలించారు. అనంతరం వారు అసిస్టెంట్ ఇంజనీర్‌ని యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా మరోబ్రిడ్జి ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మరో 36 గంటల్లో తాత్కాలిక బ్రిడ్జి నిర్మిస్తామని పిఒ తెలిపారు. అన్నవరం బ్రిడ్జికి సంబంధించిన శాశ్వత నిర్మాణం కోసం ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వం మంజూరు చేసి ఉన్నారు. ప్రాజెక్టు అధికారి ఐటిడిఎ చింతూరు మాట్లాడుతూ మరో నెల రోజులలో శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పనులు వెంటనే మొదలు పెట్టాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖా వారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ శాశ్వత బ్రిడ్జి నిర్మాణం పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా పనులను తనే స్వయంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజకుమార్, విఆర్‌పురం తహశీల్దార్ సరస్వతి, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ జెఎసి చింతూరు డివిజన్ చైర్మన్ నరేష్

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ప్రకటించాలి

- ఆదివాసీ జెఎసి చింతూరు డివిజన్ చైర్మన్ నరేష్

ప్రజాశక్తి-చింతూరు: చింతూరు మండలంలో ఆదివాసీ జెఎసి డివిజన్ సమావేశం సోమవారం నిర్వహించారు. చింతూరు డివిజన్ జెఎసి చైర్మన్ జల్లి నరేష్, వైస్ చైర్మన్ శీలం తమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రతిపాదనలో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాన్ని మొత్తం మైదానప్రాంతమైన రాజమహేంద్రవరంలో కలిపితే ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు విలీన మండలాలకు వరద బాధితుల పరామర్శకు వచ్చినప్పుడు చంద్రబాబు విలీన ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. రంపచోడవరం కేంద్రంగా జిల్లా ప్రకటన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కారం తమ్మనదొర పేరుతో ఏజెన్సీ జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఆదివాసీ ఉద్యమం తీవ్రం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పూనెం శ్రీను, సోయం రవి, తునికి సత్యం, కుంజా రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-చింతూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పరిధిలో రామన్నపాలెంలో అంగన్‌వాడి కేంద్రాన్ని సిఐటియు చింతూరు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్దిదారులకు ఆహారం అందించేందుకు పాత పద్ధతే అమలు చేయాలని సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతూరు మండలంలో దాదాపు 23 గ్రామాల్లో అంగన్‌వాడి కేంద్రాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె గృహంలో నడుపుతున్నామని వర్షం వస్తే కొన్ని కారిపోతున్నాయని దీంతో అవస్థలు పడుతున్నారన్నారు. రామన్నపాలెంలో అంగన్వాడి భవనం పాడైపోవడంతో టీచర్, ఆయా సొంతంగా ఒక పాక నిర్మించుకున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడి కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

నిర్వాసితులకు న్యాయం చేశాకే..

పనులు మొదలెట్టాలి

పార్వతినగర్‌లో ఆందోళన చేపడుతున్న అఖిలపక్ష నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో నెలకొల్పబోతున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయకుండా పనులు చేపడితే అడ్డుకుంటామని అఖిలపక్ష నాయకులు సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకర విష్ణుమూర్తి, అల్లూరి జిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, గిరిజన సంఘ నాయకులు మార్కురాజు, మనోజ్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిటుకుల రాము, కాశి హెచ్చరించారు. సోమవారం పార్వతినగర్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. 'నిర్వాసితులకు న్యాయం చేయకుండా ప్రాజెక్టుకు భూమిపూజ చేస్తే తరిమికొడతాం.. ఆదివాసి ఐక్యత వర్ధిల్లాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిమిత్తం సీలేరులో ఇంతకుముందు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్టు మొదలు పెడతామని అధికారులు తీర్మానం చేశారని గుర్తు చేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయి న్యాయం చేయకుండా ప్రజాభిప్రాయ సేకరణకు విరుద్ధంగా అధికారులు, మెగా కంపెనీ యాజమాన్యం పంపుస్టోరేజ్ ప్రాజెక్టు ప్రారంభానికి భూమి పూజలు నిర్వహించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీలేరు పార్వతినగర్ బూసికొండ శాండికోరీ నిర్వాసితులకు ఇల్లుకు ఇల్లు, భూమికి భూమి, ఇంటికొక ఉద్యోగం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రాజెక్ట్ అడ్డుకొని తీరుతామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో సీలేరు, దుప్పిలివాడ దారకొండ, గుమ్మిరేవులు పరిసర ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతులు వంద పడకల ఆసుపత్రి మారుమూల గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తీర్మానంలో పేర్కొని ఇప్పటివరకు ఆ దిశగా ఎపి జెన్కో యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. హక్కులు సాధన కోసం అఖిలపక్షం, గిరిజన సంఘాలు ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు, గిరిజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు రాక అవస్థలు

- గంగవరం పిహెచ్‌సిలో రోగుల నిరీక్షణ

వైద్యుని కోసం ఎదురుచూస్తున్న రోగులు (ఇన్‌సెట్లో) ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

ప్రజాశక్తి - గంగవరం: గంగవరం మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సరిగా సమయానికి రాకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. సోమవారం ఉదయం 11:30 సమయానికి కూడా వైద్యాధికారి విధులకు హాజరు కాకపోవడం గమనార్హం. సుమారు 20 మంది దాకా రోగులు డాక్టర్ ఎప్పుడు వస్తారా అని బయట పడిగాపులు పడుతున్నారు.
స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎప్పుడు పిహెచ్‌సికి వెళ్లినా ఇదే పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయమై చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా ఎండపల్లి, మర్రిపాలెం పరిశీలనకు వెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు.

మండల కేంద్రం ఏర్పాటుకు తీర్మానం

మాట్లాడుతున్న దారకొండ సర్పంచ్ రాజు

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం దారకొండ పంచాయితీ దారకొండలో మండల కేంద్రం ఏర్పాటుకు మండల సాధన కమిటీ శోభా జగన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచులు గిరిజన సంఘ నాయకులు హాజరయ్యారు. సమావేశంలో కీలక అంశాలపై అఖిలపక్ష నాయకులు చర్చించారు. ముందుగా మండల కేంద్రం దారకొండలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. రాజకీయలకు అతీతంగా మండల కేంద్రం ఏర్పాటుకు ఐక్యంగా పోరాడాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలో అభివృద్ధికి వెనుకబడి ఉన్న సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు, గాలికొండ పంచాయితీలు ఉన్నాయని అభివద్ధి చెందాలంటే దారకొండ మండల కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని దీనికోసం అంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.
కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ పాంగి దుర్గో, జిల్లా డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్, దుప్పిలివాడ పంచాయతీ మాజీ సర్పంచ్ ఎ.రాజు దారకొండ ఎంపిటిసి మాడి రామన్న, సర్పంచ్ ఎన్.రాజు, గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు సర్పంచ్ బుజ్జిబాబు గుమ్మిరేవుల పంచాయతీ సర్పంచ్, మాజీ సర్పంచ్ బాబురావు గిరిజన సంఘ నాయకులు మార్కురాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకర విష్ణుమూర్తి అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

జాతీయ మీడియా సదస్సుకు ఆహ్వానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజస్థాన్‌లోని మౌంట్‌అబూలో సెప్టెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సు-2025కు జర్నలిస్టులు హాజరు కావాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బికె.రామేశ్వరి తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత అణురీసెర్చ్ సెంటర్ విశ్రాంత డైరెక్టర్ పి.సి.ఉపాధ్యాయ మాట్లాడుతూ సమాజంలో శాంతిని, పవిత్రతను కాపాడటంలో మీడియా ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు. ఈ నెల 25న ప్రకాష్‌మణిదాదీ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్ స్థాయికి తీసుకువెళ్తామని 22,23,24 తేదీల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపిత సంస్థ మరో ప్రతినిధి మాధురి మాట్లాడుతూ ఈ శిబిరంలో అధికశాతం యువత పాల్గొనాలన్నారు. గౌరవ అతిథిగా బ్లడ్‌మాన్ వినోద్‌బాలు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం 85558 57990, 9177744966 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు హర్‌ఘర్ తిరంగాయాత్ర

- ప్రజలు భాగస్వామం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత స్వాతంత్ర్యానికి 79 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా,కేంద్ర పర్యాటక సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి బీచ్‌రోడ్‌లో హర్‌ఘర్ తిరంగాయాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా జాతీయపతాకం ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ జెండా భూమికను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వెల్లడించారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అధికారులను ఈ మేరకు ఆదేశించారు. పక్కా ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకు భారీఎత్తున తిరంగాయాత్ర, బైక్‌ర్యాలీ ఉంటుందని థింసా, కోలాటం, భరతనాట్యం వంటి కళారూపాల ప్రదర్శనతో తిరంగాయాత్ర జరుగుతుందన్నారు. యాత్రలో అంతా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

'యువతకు అవగాహన కల్పించడమే ధ్యేయం'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు హెచ్‌ఐవి, లైంగిక వ్యాధులు వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు యువజన దినోత్సవంలో ప్రాధాన్యం ఇస్తామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సమగ్ర ఐఈసి క్యాంపెయిన్ 2025 కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కంచారు. రానున్న 2 నెలలు దీనికి సంబంధించి వివిధ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా యువతపై దృష్టి సారిస్తామన్నారు. హెచ్‌ఐవి, లైంగిక వ్యాధులు, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడం వాటి వల్ల వచ్చే పరిణామాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి వారానికి ఒకొక్క థీమ్ చొప్పున 2 నెలలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ల్లాకు సంబంధించి 8 వారాల్లో ప్రణాళికా పరంగా 200 గ్రామస్థాయి సమావేశాలు, 20 సైకిల్ ర్యాలీలు, 700 హౌస్‌హోల్డ్ కార్యకలాపాలు, 20 జానపద ప్రదర్శనలు, మురికివాడల్లో 30 కార్యకలాపాలు, 40 ఫ్లాష్ మాబ్‌లు, 400 పాఠశాలలు, 86 కళాశాల్లో ప్రధానంగా యువతపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగము సూపర్వైజర్ భద్రి, కష్ణ పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సోమవారం స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి ఇచ్చామని, బయోమెట్రిక్‌లో ఆధార్ లింక్ తీసి వేయాలని కలెక్టర్‌ను కోరటం జరిగిందన్నారు. సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, సోమేశ్, జి.అప్పలరాజు, ఎం.తాతబ్బాయి, నాయుడు తదితరులు ఉన్నారు.